## క్లుప్తంగా

### నేడు ప్రమాణ స్వీకారం

చిట్యాల: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో నేడు(గురువారం) నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు రైతులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### ఆండాళ్ అమ్మవారి జయంతి



రేగొండ: మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి ఆలయంలో ఆండాళ్ అమ్మవారి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జన్మ నక్షత్రమైన తిరు నక్షత్రం సందర్భంగా అర్చకులు అమ్మవారికి కుంకుమార్చన, ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం అమ్మవారి సేవను పుర వీధుల గుండా ఊరేగించారు. ఆలయ ఈఓ మహేశ్, గ్రామస్తులు ముల్కనూరి భిక్షపతి, కొలుగూరి సంపత్, ఆలయ సిబ్బంది రవీందర్, శ్రావణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### నియామకం

భూపాలపల్లి రూరల్: టీఎస్‌జేయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా గణపురం మండలానికి చెందిన పావుశెట్టి శ్రీనివాస్‌ను నియమించినట్లు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మేరుగు చంద్రమోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ ఉపాధ్యక్షుడు నారగాని పురుషోత్తానికి, రాష్ట్ర, జిల్లా నాయకులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

### సన్మానం



టేకుమట్ల: మండల కేంద్రంలోని చేనేత కార్మికులను చేనేత దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఆడెపు సంపత్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. చేనేత సహకార సంఘం చైర్మన్ మహేందర్, పద్మశాలి మండల అధ్యక్షుడు నరేష్ , నాయకులు పెంట రంజిత్, మాచర్ల రాజేష్, పెంట రమేష్, ఎనగంటి సమ్మయ్య, పోశాలు, ఓదెలు పాల్గొన్నారు.

### బాధ్యతల స్వీకరణ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం తపాలాశాఖ బీపీఎం(బ్రాంచ్ పోస్టు మాస్టర్)గా శనిగరం రంజిత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన బీపీఎం కామిడి మధుసూదన్‌రెడ్డి పదవి విరమణ పొందగా ఆయన స్థానంలో రంజిత్ బాధ్యతలు తీసుకున్నారు.

### ఏబీవీపీ సభ్యత్వ నమోదు

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ, మోడల్ కళాశాలలో ఏబీవీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సమితి సభ్యుడు వెల్పుల రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. కళాశాల, పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక సేవలను ఏబీవీపీ గుర్తిస్తుందన్నారు. నిరంతరం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందని అన్నారు.

### ‘అందని ధాన్యం డబ్బులు’

కాటారం: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించి మూడు నెలలు గడుస్తున్న డబ్బులు అందలేదని కాటారం మండలం ఒడిపిలవంచకు చెందిన బండారి శ్రీధర్ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. బుధవారం బాధిత రైతు మాట్లాడుతూ.. మండలంలోని గుమ్మాళ్లపల్లిలో యాసంగి సీజన్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో వెంకటేశ్వర రైతు పరపతి సహాయక సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాను ఆ కేంద్రంలో 137 క్వింటాళ్ల ధాన్యం విక్రయించినట్లు తెలిపారు. కాగా, దాదాపు రూ.3లక్షల మేర డబ్బులు రావాల్సి ఉండగా కొనుగోలు చేసిన కొన్ని రోజులకు నిర్వాహకులు రూ.2.04 లక్షలు బ్యాంక్ ద్వారా చెల్లించినట్లు తెలిపారు. మిగితా రూ.96 వేలు ఇప్పటి వరకు చెల్లించలేదని నిర్వాహకుడు అరుణ్‌రెడ్డిని అడిగితే పొంతనలేని సమాధానం చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో ఖాతాకు రూ.96వేలు ట్రాన్స్‌ఫర్ అయ్యాయని రెండు నెలలుగా కాలం వెల్లదీస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వాపోయాడు. అంతేకాకుండా గత ఏడాది కొనుగోలు కేంద్రంలో విక్రయించిన 10 క్వింటాళ్లకు సంబంధించిన రూ.26వేలు కూడా ఏడాది గడుస్తున్న చెల్లించలేదని పేర్కొన్నారు. గ్రామంలో మరి కొంత మంది రైతులకు సైతం ధాన్యం డబ్బులు అందలేదని అన్నారు. పలుమార్లు జిల్లా సహకార అధికారిని సంప్రదించి గోడు వెల్లబోసుకున్నప్పటికీ స్పందించడం లేదని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి ధాన్యం డబ్బుల చెల్లింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# తల్లిపాలతో రోగనిరోధక శక్తి



కాటారం: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది

కాటారం: తల్లిపాలతో పిల్లలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ అన్నారు. మండలంలోని వీరాపూర్, గొల్లపల్లి, ధర్మసాగర్, విలాసాగర్, రఘుపల్లి, రేగులగూడెం, దేవరాంపల్లి, దామెరకుంట, ఒడిపిలవంచ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత, ప్రీ స్కూల్ విధానంపై అవగాహన కల్పిస్తూ అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, చిన్నారులు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. దేవరాంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వీణ మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనాయక్, మహిళా సాధికారిత అధికారి అనుష, మమత, అంగన్‌వాడీ టీచర్లు కమలాదేవి, అన్నపూర్ణ, ప్రమీల, దివ్య, రోజ, ఆశ వర్కర్లు లక్ష్మి, సరిత, జ్యోతి, ఆయా రజిత, గర్భిణులు, బాలింతలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(టి), దుబ్యాల, మందలోరిపల్లి, పెద్దంపల్లి, పంగిడిపల్లి, అంకుషాపూర్‌లో అంగన్‌వాడీ టీచర్లు తలగంపల వనిత, సంగి విజయ, మమత, సౌందర్య, కవిత, స్వప్న, భాగ్యలక్ష్మీ ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించిన అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పుట్టిన రోజు నుంచి బిడ్డకు ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలనే పట్టించాలని సూచించారు. భవిష్యత్‌లో బిడ్డ ఆరోగ్యానికి భరోసా తల్లి పాలేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ జమున, అంగన్‌వాడీ ఆయా స్వప్న, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పలిమెల: తల్లిపాలతో పిల్లల్లో రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని అంగన్‌వాడీ టీచర్ నిర్మల తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని పంకేన, మోదేడు గ్రామాల్లో తల్లులు, బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ నిర్మల మాట్లాడుతూ.. పిల్లలకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు ఇవ్వాలని బాలింతలకు సూచించారు. బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

**వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి**

చిట్యాల: గర్భిణులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సీడీపీఓ అవంతి, ఎంపీడీఓ జయశ్రీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వారు హాజరై మాట్లాడుతూ.. గర్భిణులు కూరగాయలు, పప్పు ధాన్యాలు, పాలు, పండ్లు సమపాళ్లలో తీసుకోవాలని సూచించారు. అనంతరం సివిల్ ఆస్పత్రిలో ప్రసవం అయిన ముగ్గురు తల్లులను కలిసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు చింతల సంధ్యారాణి, భాగ్యలక్ష్మి, జ్యోతి, సుజాత, అరుణ, భాగ్యమ్మ, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.

**జడలపేటలో..**

మండలంలోని జడలపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ సాధన ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీచర్ వసంత, ఆయాలు స్వరూప, సుమలత, ఆశవర్కర్లు, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.



పలిమెలలో..

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని నాలుగోవ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సీడీపీఓ రాధిక ముఖ్య అతిథిగా పాల్గొని గర్భిణులకు బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు గంటలోపు బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపాలను పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగరాణి, శివ రాణి, రమ, అంగన్‌వాడీ టీచర్లు సునీత, సత్యవాణి, సుజాత, నాగలతా, ఫర్జానా, సుశీల పాల్గొన్నారు.



చిట్యాల: మాట్లాడుతున్న సీడీపీఓ అవంతి



కాళేశ్వరం: అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ రాధిక



టేకుమట్ల: రామకిష్టాపూర్‌లో..

# ఐడీ కార్డులు, బెల్ట్‌ల పంపిణీ



ఐడీ కార్డులు చూపుతున్న విద్యార్థులు

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన జంగిడి శ్రీనివాస్ విద్యార్థులకు ఐడీ కార్డులు, బెల్ట్‌లను బుధవారం ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాఠశాల ఉపాధ్యాయుల కోరిక మేరకు తన వంతుగా విద్యార్థులకు ఐడీ కార్డులు, బెల్ట్‌లను అందించానని తెలిపారు. అలాగే భవిష్యత్‌లో పాఠశాలకు సాయం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, మండల నోడల్ అధికారి లక్ష్మణ్‌బాబు, వల్లెకుంట కాంప్లెక్స్ హెచ్‌ఎం సుదర్శనం, వల్లెకుంట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రవేశ్‌నాయక్, ఉపాధ్యాయులు గంగరాజు, మహిపాల్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ సునీత తదితరులు పాల్గొన్నారు.

# సీఎఫ్‌పీతో రైతులకు మేలు



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ శ్రీనివాస్

పలిమెల: గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు క్లస్టర్ ఫెసిలిటేషన్ ప్రాజెక్ట్ (సీఎఫ్‌పీ) ద్వారా ఎంతో మేలు కలుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాస్ గ్రామస్తులకు సూచించారు. బుధవారం మండలంలోని పంకెన, మోదేడు గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి సీఎఫ్‌పీ కింద కొత్త పనులను గుర్తించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ద్వారా గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు కోళ్లు, గొర్రెలు, మేకలు, బర్రెల షెడ్ల నిర్మాణం, కొత్త బావుల తవ్వకం, పండ్ల తోటల పెంపకం చేపట్టవచ్చని అవగాహన కల్పించారు. ఉత్సాహవంతులైన లబ్ధిదారులు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, ఏపీఓ సునీత, ఈసీ శ్రీకాంత్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్, సాంబశివుడు, ఐకేపీ సీసీ స్వామి, పంచాయతీ సెక్రటరీలు వినయ్, కృష్ణారెడ్డి, సాల్మన్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు విధుల బహిష్కరణ.. ర్యాలీ



ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

జనగామ: ఓ కేసు విషయమై మాట్లాడేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాద దంపతులు అమృతరావు, కవితలపై పోలీసులు దాడి చేశారని నిరసిస్తూ జనగామ కోర్టులో రెండోరోజు బుధవారం విధులను బహిష్కరించారు. న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రరుషి ఆధ్వర్యాన అడ్వొకేట్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా వరంగల్, భూపాలపల్లి, పరకాల, సిద్దిపేట, రంగారెడ్డి, సూర్యాపేట, హైదరాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం జిల్లాలకు చెందిన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వచ్చారు. ప్రముఖులు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో ఉదయం, మధ్యాహ్నం చర్చలు జరిపారు. సీఐతోపాటు దాడిలో పాల్గొన్న ఎస్సై, పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. చర్చలు విఫలం కావడంతో కోర్టు ఆవరణ నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించగా.. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

**న్యాయవాదుల ఫిర్యాదుపై కేసు నమోదు**

పోలీసులు, న్యాయవాదుల మధ్య జరిగిన వివాదంలో న్యాయవాదులు ఇచ్చిన ఫిర్యాదుపై జనగామ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులపై కేసు నమోదు చేయడంతోపాటు శాఖాపరమైన విచారణ ప్రారంభించారు. ఈ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మను విచారణ అధికారిగా నియమించినట్లు వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు.

### పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

మహాముత్తారం: మండలంలో ఉపాధిహామీ పథకం కింద 2018 నుంచి 2024 మార్చి వరకు పనిచేసి వందరోజులు నిండిన కూలీ కుటుంబాలకు ఉన్నతి కార్యక్రమం కింద పుట్టగొడుగుల పెంపకంపై ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారికి ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకాలం పదిరోజులు ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో మధ్యాహ్న భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 13న మండల పరిషత్ కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు.

### కుట్టు మిషన్ అందజేత



కుట్టు మిషన్ అందజేస్తున్న జడ్జీలు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రానికి చెందిన నిరుపేద మహిళకు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కుట్టు మిషన్ అందజేశారు. జిల్లా కోర్టు ఆవరణంలో జిల్లా జూనియర్ జడ్జీలు జయరాంరెడ్డి, రాంచందర్‌రావు చేతుల మీదగా అందజేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి తెలిపారు. చిన్నతనంలో భర్తను కోల్పోయి నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు ఫౌండేషన్ దృష్టికి రావడంతో జీవనోపాధి కోసం కుట్టు మిషన్ అందించినట్లు తెలిపారు.

### కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

రేగొండ: సేవలాల్ సేన రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సేవలాల్ సేన మండల అధ్యక్షుడు ఇస్లావత్ శ్రీను నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం తండాలో మండల కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవం పురస్కరించుకుని రేపు(ఆదివారం) హైదరాబాద్‌లో జరిగే సభకు ఆదివాసీలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవలాల్ సేన గ్రామ కమిటీ అధ్యక్షుడు బానోత్ రాజేందర్, సభ్యులు రవీందర్, రాజు, చందులాల్, వినోద్, మధు, బాలు నాయక్, వీరు నాయక్ పాల్గొన్నారు.

### ‘పైసలిస్తేనే పనులు’

చిట్యాల: మండల కేంద్రంలోని కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో రుణాల రెన్యువల్ విషయంలో పైసలిస్తేనే ఫైల్ కదులుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బ్యాంక్ అధికారులు రైతుల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. కనీసం రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకు తీసుకుంటున్నారని వాపోయారు. డబ్బులు ఇచ్చిన వారికే తొందరగా రెన్యువల్ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి అధికారులను గుర్తించి వారిపై చర్య తీసుకోని రైతులకు న్యాయం చేయాలని జిల్లా అధికారులను కోరారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



గట్టయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న పుట్ట మధు

కాటారం: మండలంలోని గారెపల్లికి చెందిన కట్కు శ్రీనివాస్, మొగిలి గట్టయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మండల లక్ష్మారెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పంతకాని సద్వలి, ఎస్టీ సెల్ డివిజన్ అధ్యక్షుడు తైనేని సతీశ్, నాయకులు కొండగొర్ల వెంకటస్వామి, జాడి శ్రీశైలం, పసుల శంకర్, దుర్గారావు, రాజబాబు, లింగయ్య, అడువాల మొగిలి, బాపు, అశోక్ పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సంజీవరావు

కాటారం: ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేకాధికారి సంజీవరావు సూచించారు. మండలంలోని మేడిపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. తరగతుల నిర్వహణ, విద్యా బోధన, సమస్యలు, తదితర అంశాల గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా, తరగతులు సరిగా జరుగుతున్నాయా అని ఆరా తీశారు. వంటగది, వంట సామగ్రి, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలో ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే కలెక్టర్‌కు వివరిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేకాధికారి వెంట పాఠశాల పీడీ వీరయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

# వ్యాధులపై అప్రమత్తత అవసరం

పలిమెల: వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పలిమెల ఆరోగ్య ఉప కేంద్రం వైద్యుడు రఘురామన్ గొత్తికోయలకు సూచించారు. పలిమెల సమీపంలో ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చి నూతనంగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్న గొత్తికోయగూడెంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితుల రక్తనమూనాలు, థైరాయిడ్, పలు రకాల పరీక్షల కోసం శాంపిల్స్ సేకరించారు. పలువురికి అలర్జీ ఉండటం వలన అనుమానితల నుంచి నమూనాలు తీసుకున్నారు. గర్భిణులు, చిన్నపిల్లలకు టీకాలు వేశారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల పౌష్టిక విలువల గురించి వివరించి వివరించారు. పిల్లలకు తల్లిపాలను మాత్రమే తాగించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, ఎండీ మషూక్ అలీ, హెల్త్ సూపర్‌వైజర్ సమ్మక్క, హైల్త్ విజిటర్ సుధాకర్, ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

**కాటారంలో..**

కాటారం: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని ఒడిపిలవంచలో మండల వైద్యాధికారిని డాక్టర్ మౌనిక ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలు, దగ్గు, జలుబు, పలు వ్యాధులతో బాధపడుతున్న రోగులను పరీక్షించి మందులు అందజేశారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా డ్రై డే చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ తిరుపతి, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఏఎన్‌ఎంలు పద్మావతి, శ్యామల, పంచాయతీ కార్యదర్శి అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



కాటారం: పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు



కాళేశ్వరంలో..

కాటారం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా భావించాలని తహసీల్దార్ నాగరాజు అన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని రేగులగూడెంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. డ్రెయినేజీ శుభ్రం చేయడం, మురుగునీరు, చెత్తాచెదారం తొలిగింపు, ప్రమాదకర గుంతల్లో మట్టి నింపే చర్యలు చేపట్టారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను తహసీల్దార్ పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల చుట్టు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిచ్చి మొక్కలు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం నాలాల పూడిక తీత, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి డీఎల్‌పీఓ వీరబ్రహ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాముత్తారం: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో తిరుగుతూ నీటి నిల్వలు ఉన్న ప్రదేశాలను గుర్తించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. వీధుల్లోని చెత్తను తొలగించి ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. పంచాయతీ కార్యదర్శి వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వాగతోత్సవ ర్యాలీకి తరలిరావాలి

కాటారం: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 13న హైదరాబాద్‌లో నిర్వహించనున్న స్వాగతోత్సవ ర్యాలీకి మాదిగ, ఉపకులాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చిరంజీవి మాట్లాడారు. మాదిగ, మాదిగ ఉపకులాల చిరకాల కోరిక అయిన ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ నిరంతరం శ్రమించి సాధించారని పేర్కొన్నారు. వర్గీకరణ సాధన అనంతరం మంద కృష్ణమాదిగ మొదటిసారి హైదరాబాద్‌కు వస్తున్న నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్వాగతోత్సవ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. లక్షల డప్పులతో ర్యాలీ ఉంటుందని అన్నారు.